
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
సోమవారం, మార్చి 2, 2026 పేజీలు: 6







# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

-ఎస్పీ డాక్టర్ వినీత్.
-ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగ కార్యక్రమాలు, సభలు జిల్లాలో నిషేధం



**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చ్ 1 ప్రజా జ్యోతి**

శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు “30 పోలీస్ ఆక్ట్” అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... 30 పోలీస్ ఆక్ట్ మార్చ్ 31వ తేది వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు వంటి కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు

-మిగతా 2లో..

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

- హన్వాడ మండలంలో గృహ ప్రవేశాలు
- పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే స్పష్టం



**మహబూబ్‌నగర్, మార్చి 1 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండలం కిష్టంపల్లి, గుడ్డిమల్కాపూర్, టంకర గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు

-మిగతా 2లో..

# మాటల ముసుగులో మొసలి రాజకీయం!

- మీడియాపై ముసురు కమ్మిన అక్కసు..!!
- జర్నలిజంపై జడివాన మాటలు
- ప్రజాస్వామ్యానికి పచ్చి మిరపకాయల హెచ్చరికలు




**మహబూబ్‌నగర్, మార్చి 1 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా నిలిచే మీడియాను “పవిత్రమైన వృత్తి” అని ఒకవైపు ప్రశంసిస్తూ, అదే వేదికపై కొందరు జర్నలిస్టులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం రాజకీయ నాయకుల ద్వంద్వ వైఖరికి

-మిగతా 2లో..



# చిన్నారి మృతిపై వేగవంతంగా విచారణ పూర్తి చేయాలి

-ఎంపీ మల్లు రవి,ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్ : మార్చ్ 01 ప్రజా జ్యోతి**

నాగర్ కర్నూల్ జిల్ల బిజినపల్లి మండలం పాలెం గ్రామంలో చోటుచేసుకున్న దారుణ ఘటనపై ఎంపీ మల్లు రవి,ఎమ్మెల్యే డాక్టర్. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి తీవ్రంగాస్పందించారు. మూడు నెలల చిన్నారిని నీటి తొట్టిలో వేసి హత్య చేసిన ఘటననుఖండిస్తూ,నిందితుల ను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులనుఆదేశించారు. ఆ దివారం పాలెం గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే,ఎంపీ సంఘటన వివరాలనుతెలుసుకొని,బాధిత కుటుంబ

-మిగతా 2లో..

## మాటల ముసుగులో

# మొసలి రాజకీయం!

నిదర్శనం కాకపోతే మరేమిటి? తాజాగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ ప్రశ్నను మళ్లీ ముందుకు తెచ్చాయి. "జర్నలిజం సమాజానికి వైద్యం చేసే వృత్తి" అని చెప్పిన ఆయన, కొందరు జర్నలిస్టులు "సోయి లేకుండా" వార్తలు రాస్తున్నారని విమర్శించారు. వార్త రాసేముందు నిజ నిర్ధారణ (కన్ఫర్మేషన్) చేసుకోవాలని, ఇరు వర్గాల వాదనలు వినాలని సూచించారు. కానీ కొందరు నిజాయితీ గల నేతలు దయ్యాలు వేదాలు వల్లించినట్లు మాట్లాడతారు వాస్తవంగా జర్నలిస్ట్ లు ఫోన్లు చేస్తే లిఫ్ట్ చెయ్యరు సరి కదా వాట్సాప్ లో ఫోటోలు, టెక్స్ట్ మెసేజ్ లు పెడితే రెండు టిక్ లు పడ్డా కలర్ మారకుండా పెట్టుకునే దౌర్భాగ్య స్థితిలో కొందరు ప్రజా ప్రతినిదులు నాయకులు ఉన్నారు అంటే అతిశయోక్తి కాదేమో అనిపిస్తుంది మాటలతో చూస్తే ఇవి పాఠ్యపుస్తకపు సిద్ధాంతాలు. కానీ ఈ సలహాల వెనుక దాగి ఉన్న రాజకీయ అక్కసే అసలు కథ.

**రిసార్ట్ రాజకీయాలు -- నిజం ఎవరిది.?**

మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక నేపథ్యంలో క్యాంపు రాజకీయాలకు బీజం వేసింది ఎవరూ.. శంషాబాద్ రిసార్ట్స్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, మేయర్ రేసులో ఉన్న ప్రసన్న భర్త ఆనంద్ గౌడ్ అరెస్ట్ వ్యవహారం, ఆపై వెలువడిన వార్తలు -- ఇవన్నీ రాజకీయ దుమారం రేపాయి. అరెస్ట్ కాలేదని చెప్పడం, కానీ అరెస్ట్ వార్తలు రావడం -- ఈ గందరగోళానికి అసలు కారణం ఎవరు? "ఆవుకు గడ్డి చూపించి, ఆవిడికి మాట ఇచ్చినట్లు" వ్యవహరించడం రాజకీయ నాయకుల పాత నైజం కాదా.?వార్తలు రాయడం మీడియా పని. చర్యలు చేపట్టడం అధికారుల పని. కానీ "చేతిలో నూనె వేసుకుని అగ్గిలోకి నెట్టినట్టు" రాజకీయంగా జరిగిన చర్యల్ని కప్పిపుచ్చుకునేందుకు మీడియాపైనే మోపడం సరైనదా.?

**95 శాతం మంచివాళ్లు... 5 శాతం మచ్చ?**

"95 శాతం మంది జర్నలిస్టులు నిజాయితీగా ఉన్నారు, 5 శాతం వల్ల మచ్చ వస్తోంది" అన్న వ్యాఖ్యలు వినిపించాయి. అయితే ప్రశ్న ఒకటే --- ఆ 5 శాతం ఎవరు? ఆధారాలు ఉన్నాయా? లేక "పులి వస్తోందని అరిచి, గొర్రెల్ని భయపెట్టినట్టు" విమర్శలు విసరడం మాత్రమేనా?

జర్నలిజం తప్పు చేస్తే చట్టం ఉంది, న్యాయస్థానాలు ఉన్నాయి. కానీ రాజకీయ వేదికలపై "మంచివాళ్ల కోపం ఉప్పెనలా మారుతుంది" అని హెచ్చరికలు చేయడం మాటల దౌర్జన్యమే కాని ప్రజాస్వామ్య సంస్కారం కాదు.

**మాటల మిరపకాయలు -- ప్రజాస్వామ్యానికి ముప్పు**

"తప్పుడు వార్తలు రాస్తే సహించేది లేదు" అన్న హెచ్చరికలు ప్రజాస్వామ్యంలో ప్రమాదకర సంకేతాలు. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజం. మీడియా ప్రశ్నిస్తే అది కక్ష కాదు, బాధ్యత. రాజకీయ నాయకులు సమాధానం ఇవ్వాలి గానీ, మీడియాను మౌనంలోకి నెట్టే ప్రయత్నం చేయకూడదు. "చేతికి అందని ద్రాక్ష పులుపు" అన్నట్టు, తమకు అనుకూలంగా రాకపోతే వార్తలను తప్పుబట్టడం రాజకీయాల్లో కొత్తేమీ కాదు. కానీ మీడియాను బెదిరించే స్వరాలు పెరిగితే, అది ప్రజాస్వామ్యపు ఊపిరిని బిగించే ప్రమాదం ఉంది. జర్నలిజం పవిత్రమైతే, దానిపై నమ్మకం ఉండాలి. తప్పు ఉంటే చట్టపరంగా సవాలు చేయాలి. కానీ రాజకీయ అక్కసుతో మీడియాను ఒకే తాటిపై కొట్టడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. "నిజం నిప్పులాంటిది" --- దాన్ని కప్పిపుచ్చాలనుకుంటే చేతులు కాలుతాయి ఆకులు పట్టుకున్నా ప్రయోజనం వుండదు అన్నది పెద్దల మాట. బిస్కెట్ లు వేసి మాటలతో ముసుగు కట్టినా, వాస్తవం వెలుగులోకి రావడం ఖాయం.

## 'రంజాన్" పవిత్రతకు ప్రతిరూపం-క్రమశిక్షణకు నిదర్శనం

**-జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న రంజాన్ ఉపవాసాలు**

**నాగర్ కర్నూల్ : మార్చి 01ప్రజా జ్యోతి**

ముస్లింలక యొక్క అతి పవిత్రమైన రంజాన్ నెల ప్రారంభం కావడంతో గత పన్నెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు కొనసాగుతున్నాయి.నెల రోజుల పాటు సాగే ఈ పవిత్ర రంజాన్ కఠోర దీక్షలు కేవలం ఆకలిని తట్టుకోవడమే కాకుండా అంతరాత్మను శుద్ధిచేసే ఆధ్యాత్మిక ప్రయాణం.

**ఆధ్యాత్మిక శిఖరం రంజాన్ :-**

ఇస్లాం మతం యొక్క ఐదు ముఖ్య స్తంభాలలో రోజా (ఉపవాసం) అత్యంత కీలకమైనది.పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లింలు సూర్యోదయానికి ముందు నుంచి (సహర్), సూర్యాస్తమయం వరకు (ఇఫ్తార్) నీరు కూడా సేవించకుండా నిష్టగా గడుపుతారు. ఉపవాసంఅంటే కేవలం ఆహారం మానవేయడమే కాదురంజాన్ దీక్షలో కొన్ని ముఖ్యమైన నియమాలు ఉన్నాయి.అసత్యాలను పలకకుండా,ఎవరినీదూషించకుండా,చెడు దృశ్యాలను చూడకుండా,చెడు మాటలను వినకుండా,చెడు మాట్లాడకుండా భగవన్నామ స్మరణలో గడపాలి. ఈ పవిత్రమైనరంజాన్ మాసంలో ఖురాన్ ప్రకారం నెల రోజులుఉపవాస వ్రతాన్ని పాటించాలి.రంజాన్ నెల అంటే ముస్లిం విశ్వాసుల పండుగ అని అర్థం. స్నేహానికి అభిమానానికి రంజాన్ ప్రత్యేకం.రంజాన్ నెలలో ముస్లింలు క్రమశిక్షణ,దాతృత్వం,ధార్మికచింతనలో అల్లాను ప్రార్థిస్తారు. 30 రోజుల ఉపవాస దీక్షల అనంతరం రంజాన్ పండుగను జరుపుకుంటారు.

**నిష్టతో ఉపవాసాలు:-**

రంజాన్ మాసం ప్రారంభమైన నాటినుండి ముగిసే వరకు ముస్లింలు నిష్ఠతో (రోజా) ఉపవాస దీక్షలు పాటిస్తారు.ఉపవాసం సందర్భంగా కేవలం ఆహార పానీయాలను మాత్రమే కాకుండా నియమాలతో కూడుకున్న జీవన విధానాన్ని ఆచరిస్తారు.తెల్లవారుజామున ఆహారం తీసుకోవడానికి సహర్ అని సాయంత్రం ఉపవాస దీక్ష విరమణలో తీసుకునే ఆహారాన్ని ఇస్తార్ అని అంటారు.ఇలా ప్రతిరోజు సుమారు 13 గంటల పాటు కఠోరమైన ఉపవాస(రోజా)దీక్షలను.అవలంభిస్తారు.ఒకవేళ ఏదైనా అనారోగ్యంతో ఉపవాసం ఉండలేకపోతే అలాంటివారు రంజాన్ తర్వాత వాటిని పూర్తి చేస్తారు.

**శబ్ ఏ ఖదర్ :--**

రంజాన్ మాసం ప్రారంభమైన 27వ, రోజున
శబే ఖదర్ జరుపుకుంటారు.ఈ రోజున దివ్య ఖురాన్ అవతరించిందని ముస్లింల విశ్వాసం.శబే ఖదర్ రోజున రాత్రి అంతా జాగారణ చేసి
ప్రత్యేక ప్రార్థనలతో గడుపుతారు.ఆ రాత్రి భక్తి
శ్రద్దలతో ప్రత్యేక ప్రార్థనలు చేసిన వారికి ఎన్నో సంవత్సరాలపాటు ప్రార్థనలు చేస్తే వచ్చే పుణ్యంఈ మాసంలో దక్కుతుందని ముస్లింల విశ్వాసం.

**ఫిత్రా:-**

ఈ రంజాన్ మాసమంతా ప్రత్యేక నమాజులు,



ఉపవాసాలు,జకాత్ చెల్లించడంతో పాటు నెల ముగిసిన అనంతరం పండుగను జరుపుకునేముందు "ఫిత్రా" రూపంలో దానం చేస్తారు.పేదలు కూడా పండుగ రోజు సంతోషంగా పాల్గొనాలని చేసిన ఏర్పాటూనే"ఫిత్రా"అంటారు.కుటుంబంలోఎంతమంది సభ్యులు ఉంటే అందరి తరపున విధిగా ఈ ఫిత్రా చెల్లిస్తారు.ఒక్కోరికి ఫిత్రా కింద రెండున్నర కిలోల ఆహార ధాన్యం లేదా అందుకు సమానమైన నగదును చెల్లించాలి.

**జకాత్ :--**

ముస్లింలకు నమాజ్,రోజా ప్రకారమే "జకాత్ "
కూడా నిర్ణయింపబడింది.దైవం కోసం,దైవ ప్రసన్నత పొందడానికి ఒక బాధ్యతగా తానుసంపాదించిన సంపదలో కొంత మొత్తాన్ని పేదలకు అందించడమే "జకాత్" ముఖ్య ఉద్దేశ్యం.రంజాన్ నెలలోనే ముస్లింలు విధిగా జకాత్ చెల్లిస్తారు.పేద,ధనిక అంతరాలను రూపుమాపడానికి "జకాత్"తోడ్పడుతుందని ముస్లింలు నమ్ముతారు.

**ప్రతి పది రోజులకు ఓ ప్రత్యేకత:--**

30 రోజుల ఉపవాస దినాల్లో ప్రతి పది రోజులకు ఓ ప్రత్యేకత ఉంది.మొదటి పది రోజులు కారుణ్య దినాలుగా భావిస్తారు అల్లాహ్ కారుణ్యం కోసం ఈ పది రోజులు ఉపవాసం ఉంటారు,11 నుంచి 20 రోజుల వరకు క్షమాభిక్ష దినాలుగా పరిగణించి
తమ పాపాలను క్షమించమని అల్లాహ్ ను
వేడుకుంటూ ఉపవాసాలు ఉంటారు.చివరి పది రోజులు నరకాగ్ని నుంచి తమని కాపాడమని
దువాచేస్తూ ఉపవాసాలు పాటిస్తారు.ఉపవాసం
మనిషిలో దైవభీతిని కలుగజేస్తుంది కోరికలకు ఖననం వేస్తుంది. ఉపవాసం ఉండే మనిషికి
మనసు మీద నియంత్రణ సులువు అవుతుంది ఆరోగ్యంతో పాటు ఇతరుల పట్ల సోదర భావం పెరుగుతుంది,త్యాగ నిరతిని పెంపొందించే ఈ
రంజాన్ ఉపవాస దీక్షలు ప్రతి ముస్లిం విధిగా చేయాలి.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధం లో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునీ అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇంటితో పేద కుటుంబాల సొంతింటి కల సాకారం కావడమే కాకుండా వారి ఆత్మగౌరవాన్ని పెంచడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాలను అందిస్తున్నదని తెలిపారు. ప్రతి పేద కుటుంబం భద్రతతో, గౌరవంతో జీవించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గ్రామీణాభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల అమలే తమ ప్రధాన ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వి. మహేందర్, సీనియర్ నాయకులు యాదిరెడ్డి, టంకర కృష్ణయ్య యాదవ్, అచ్చెన్న, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి తదితరులు, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### చిన్నారి మృతిపై వేగవంతంగా విచారణ పూర్తి చేయాలి

సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,ఇటీవలి కాలంలో చిన్నారులపై మృతి సంఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ ఘటనపై వెంటనే సమగ్ర విచారణ జరిపించి,నిందితులను త్వరగా పట్టుకుని కఠిన శిక్షలు విధించాలని పోలీస్ శాఖకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.బాధిత
కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని తెలిపారు.

## జిల్లా వ్యాప్తంగా నెలరోజుల పాటు 30, 30(ఎ) పోలీసు చట్టం అమలు

**- అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు నిషేధం: ఎస్పీ జానకి**




మహబూబ్‌నగర్, మార్చి 1 ( ప్రజా జ్యోతి బ్యూరో ) శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా మార్చి 1 ఉదయం 6 గంటల నుంచి మార్చి 31 సాయంత్రం 6 గంటల వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు చట్టం--1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా లేదా ప్రజాధనానికి నష్టం కలిగించే ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు చేపట్టకూడదని హెచ్చరించారు.జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఆంగ్ల భాష పై అదుర్స్ సరస్వతి విద్యార్థులు





**ఎర్రవల్లి/ఇటిక్యాల (ప్రజాజ్యోతి) మార్చి 01:**
అలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండల కేంద్రం లోనిఎర్రవల్లి శ్రీ సరస్వతి ఇంటర్నేషనల్ స్కూల్ నందు ఘనంగా ఆంగ్లభాష సంబరాలు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎర్రవల్లి మండల ప్రస్తుత విద్యాశాఖ అధికారి అమీర్ పాషా మాజీ విద్యాశాఖ అధికారి ఈ రాజు ఎర్రవల్లి గ్రామ సర్పంచ్ అనిత కృష్ణ సాగర్ విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు చేసిన ఆంగ్ల ప్రదర్శన మరియు ఆంగ్ల భాష ప్రాధాన్యతను తెలుపుతూ ప్రత్యేక ఆకర్షణంగా నిలిచింది. చిన్నారులు చేసిన ఆక్టివిటీలు తెలిపే విధానంలో ఆంగ్లంలోనే మాట్లాడడం ఎంతగానో నచ్చిందని విద్యార్థులను మరియు పాఠశాల యాజమాన్యాన్ని ముఖ్య అతిథులుగా విచ్చేసిన అతిథులు అభినందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా రూపొందించిన రైల్వే జంక్షన్ నమూనా, ప్రాథమిక సరస్వతి ఆరోగ్య కేంద్రంను ఆంగ్ల రచయిత షేక్స్పియర్ రచించిన దా మర్చంట్ ఆఫ్ వెన్నిస్ ఇట్టి కార్యక్రమానికి విచ్చేసిన ప్రేక్షకులను మరియు ఎంతగానో అలరించింది.

ఈ కార్యక్రమంలో భాగంగా సరస్వతి రేడియో పాడ్ కాస్ట్ మరియు ఇన్స్టాగ్రామ్ పేజ్ లాంచ్ చేయడం సరస్వతి మూవీ క్లాప్ కొట్టడం జరిగినది.




ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీ వీర గోవర్ధన్ రెడ్డి,డైరెక్టర్ శ్రీ వీర శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ శ్రీమతి మధులిక రెడ్డి,ప్రిన్సిపాల్ సుధీర్ కుమార్, సంధ్యారెడ్డి,మరియు అధ్యాపక బృందం విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి-షాదీముబారక్ పతకాలు పేదలకు వరం

### -ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి





**నాగర్ కర్నూల్ : మార్చ్ 01ప్రజా జ్యోతి**
కల్యాణ లక్ష్మి-షాదీముబారక్ పతకాలు పేదలకువరం అని ఎమ్మెల్యే డాక్టర్.కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి అన్నారు.ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోతిమాజీపేట మండలానికి సంబందించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.లబ్ధిదారులు తమకు అందించిన సాయానికి కృతజ్ఞతలు తెలుపుతూ,ప్రభుత్వానికి మరియు ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి కికృతజ్ఞతలు తెలిపారు.ప్రజా సంక్షేమం కోసం మరింతసమర్థంగా పనిచేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని,అందరూ కలిసి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తిమాజీపేట మండల్ ప్రెసిడెంట్ వెంకట్ రామ్ రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు,మండల ముఖ్య నాయకులు,ప్రభుత్వ అధికారులు,లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తిరిగి సొంతగూటికి చేరుకున్న బిఆర్ఎస్ నాయకులు

### -బీజేపీ నుంచి 20 మంది నాయకులు గులాబీ గూటికి

**చిన్నంబావి, మార్చి 1 (ప్రజాజ్యోతి)**
చిన్నంబావి మండలం కొప్పునూర్ గ్రామంలో రాజకీయంగా కీలక పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ పార్టీకి చెందిన కొప్పునూర్ గ్రామ నాయకులు 20 మంది, అలాగే వెల్లటూరు గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు భారత రాష్ట్ర సమితిలో చేరారు.ఈ కార్యక్రమం కోల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మరియు బీఆర్ఎస్ నాయకుడు అభిలాష్ రావు సమక్షంలో జరిగింది. చేరికైన నాయకులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీలో కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, అవకాశాలు లభిస్తాయని తెలిపారు. యువతకు పెద్దపీట వేసే పార్టీ బీఆర్ఎస్ అని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. అభిలాష్ రావు కూడా మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కార్యకర్తలకు అండగా నిలిచే పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కేశిరెడ్డి చిన్నారెడ్డి, నంది రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఆనంద్ యాదవ్, చిన్నంబావి మాజీ సర్పంచ్ రంజిత్, తగరం ఆటో కుర్మయ్య, కుమార్ వడ్డేమాన్, రామకృష్ణ ఉగ్ర, నరసింహ కత్తి, నారాయణ తగరం, వకీల్ బాలకిష్టయ్య, రాజ్‌కుమార్ కత్తి, వెంకటస్వామి కత్తి, కృష్ణయ్య తగరం, హిట్లర్ నరసింహ తగరం, నాగరాజు తగరం, శీలం నాగేంద్రం (మాజీ సర్పంచ్), నరసింహ కత్తి, శాలు నాగ వడ్డేమాన్, మద్దిలేటి తగరం, దేవర పోగు శివ, మోహన్‌కుమార్ వడ్డేమాన్ తదితరులు పాల్గొన్నారు.




## గద్వాల మున్సిపల్ వైస్ చైర్మన్‌కి ఘన సన్మానం

**గద్వాల (ప్రజా జ్యోతి) మార్చి 01:**
గద్వాల మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శంకర్ ను ఘనంగా సన్మానించారు.అనంతరం వారు మాట్లాడుతూ, శంకర్ రాజకీయంగా ఎన్నో ఉన్నత పదవులు చేపట్టాలని కోరారు.ఈకార్యక్రమంలో డాక్టర్ ప్రేమ్ కుమార్, నాగేందర్,అశోక్,శేషన్న పాల్గొన్నారు.



## సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి భారతీయుడి కర్తవ్యం

### -ఎమ్మెల్యే డాక్టర్. రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ : మార్చ్ 02ప్రజా జ్యోతి**
సనాతన ధర్మ పరిరక్షణ అలయెన్స్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్స్‌లో సనాతన ధర్మ పరిరక్షణ కోసం రౌండ్ టేబుల్ సమావేశంనిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కుచుకుళ్ల రాజేష్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్. రాజేష్ రెడ్డిమాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి భారతీయుడి కర్తవ్యమని సమాజంలో ధార్మిక విలువలు,ఆచారాలు,సంప్రదాయాలను కాపాడటంలో అందరూ ఐక్యంగా పనిచేయాలని ముఖ్యంగా యువత ధార్మిక చైతన్యంతో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు.నాగర్ కర్నూల్ జిల్లాలోని దేవాలయాలు,ధార్మిక మరియు ఆధ్యాత్మిక సంస్థలు,కుల సంఘాలు, అర్చకులు,పౌరోహిత్య సంఘాల ఐక్యవేదికగా ఏర్పడి సనాతన ధర్మ పరిరక్షణ కోసం కలిసి పనిచేయడం అభినందనీయమని,స్వామీజీలు,





పీఠాధిపతులు,గురూజీల మార్గదర్శకత్వంలో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించి ధార్మిక చైతన్యాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర ,వైస్ చైర్మన్ బాదం రమేష్ వివిధ దేవాలయాల ప్రతినిధులు, ఆధ్యాత్మిక నాయకులు,సంఘాల ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హామీల హారతి - ఇండ్ల ఇంతజాము ఎక్కడ.?

**- నిమ్మరసం తాపించి దీక్షలు విరమింపజేసి...**
**సంవత్సరం కావస్తున్నా ఫలితం శూన్యం!**
**- హామీల హంగామా -- సమాధానం ఎక్కడ నాయకా.?**

**మహబూబ్‌నగర్, మార్చి 01 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

ఇళ్ల తాళాలు చేతిలో పెడతామన్నారు... ఎన్ ఓ సీ లు వెంటనే ఇచ్చేస్తామన్నారు... కానీ ఏడాది గడిచినా తాళాలు తలుపులకే కనిపించటంలేదు, ఎన్ ఓ సీ లు ఫెల్స్ కే పరిమితమయ్యాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. "తాళాలు ఇస్తామంటే తలుపులే కనిపించకపోతే ఎలా.?" అని జర్నలిస్టులు చలోక్తులు విసురుతున్నారు. "మాటల తాళం వేసి హామీల పెట్టె మూసేశారా?" అన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది. ఎన్ ఓ సీ అంటే 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' అని ప్రజలకు తెలుసు గానీ, ఇక్కడ మాత్రం 'నో ఆక్షన్ సర్టిఫికెట్' అయిందేమో అని కొందరు వ్యంగ్యంగా అంటున్నారు. సన్మాన వేదికలపై చప్పట్లు గట్టిగా వినిపించినా, ఇండ్ల తలుపుల
వద్ద నిశ్శబ్దమే మిగిలిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. "ముందు తాళాలు... తరువాత శుభాకాంక్షలు" అన్న సాదాసీదా
లాజిక్ నాయకత్వం మరిచిపోయిందా.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హామీలు గాలిలో కాకుండా గడువులో నెరవేరితేనే విశ్వాసం నిలుస్తుందని జర్నలిస్టు వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.
లేదంటే... "తాళాలు మాటల్లోనే, ఇళ్లు కలల్లోనే" అన్న సామెత నగరంలో కొత్తగా పుట్టినట్టే అవుతుందనే చర్చ సాగుతోంది.
మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో జర్నలిస్టులు డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం చేపట్టిన దీక్షలకు అప్పుడు నిమ్మరసం తాపించి హామీల హారతిచ్చిన ప్రస్తుత డిప్యూటీ మేయర్ సురేందర్ మాటలు ఈ రోజు "మాటలే గానీ మట్టికాదు" అన్న సామెతను గుర్తు చేస్తున్నాయనే చర్చ జర్నలిస్టు వర్గాల్లో వినిపిస్తోంది. "స్వంత జాగా కొని అయినా ఇళ్లు ఇస్తాం" అన్న ప్రగల్భాలు పలికిన నాయకత్వం, సంవత్సరం దాటినా అమలు వైపు అడుగు వేయకపోవడం "చెప్పిందే చెల్లదు -- చేసినదే మెల్లదు" అన్నట్లుగా మారిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.
ఆ రోజు ధర్నా చౌక్‌లో హామీల హడావుడి, నిమ్మరసం గ్లాసులతో దీక్షల విరమణ... కానీ నేడు ఆ హామీల గ్లాసుల్లో నీళ్లు ఎండిపోయినట్టే పరిస్థితి. "ఆవుకు గడ్డి చూపించి ఆవిడికి మాటిచ్చినట్టు" హామీలు ఇచ్చి, అమలు




మాత్రం గాలిలో కలిసిపోయిందా.? అని జర్నలిస్టులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఆదివారం ప్రెస్ క్లబ్‌లో యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మేయర్ మమత, డిప్యూటీ మేయర్ సురేందర్‌లకు సన్మానం పేరుతో కార్యక్రమం ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. "ఇళ్లు రాకముందే సన్మానం... హామీ నెరవేరకముందే హర్షధ్వానాలు.?" అంటూ కొందరు వ్యంగ్యంగా చలోక్తులు విసురుతున్నారు. "ముందు ముచ్చట, తరువాత మౌనం" అన్నట్లుగా పరిస్థితి మారకూడదనే ఆందోళన వ్యక్తమవుతోంది.
సీనియర్ జర్నలిస్టు ఏముల నర్సిములు కూడా జిల్లా జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, ప్రత్యామ్నాయ ఉపాధి కోసం రాజీవ్ వికాసం పథకం కింద ఆర్థిక సహాయం అందించాలని కోరారు. మౌలాలి గుట్ట, ఎస్వీఎస్ గుట్ట ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న ఇండ్ల పనులను పూర్తి చేసి జర్నలిస్టులకు అప్పగించాలని ఆయన స్పష్టం చేశారు. ఇండ్లు కట్టుకోలేని వారికి ఎన్ ఓ సి ఇస్తామన్నారు. 102 ఇండ్లు మంజూరు కాగా, 80కి ప్రతిపాదించి, కేవలం 18 మాత్రమే నిర్మించారనే అంశంపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. అక్రిడిటేషన్ కార్డులు, బస్ పాస్ సౌకర్యం, ఆరోగ్య బీమా, పిల్లలకు రైట్ టు ఎడ్యుకేషన్ అమలు, రైల్వే పాసుల పునరుద్ధరణ వంటి అంశాలపై చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ చొరవ చూపాలని కూడా సూచించారు. "హామీ అంటే హారతి కాదు -- అమలు అంటే ఆచరణ" అన్న నానుడి ఈ సందర్భంలో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. జర్నలిస్టుల ఇళ్ల సమస్యపై నాయకత్వం స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించి, గడువు విధించి అమలు చేస్తేనే "మాట నిలబెట్టిన నాయకులు" అన్న పేరు వస్తుందని జర్నలిస్టు వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. లేకపోతే... "హామీ హారతి -- ఇల్లు ఎక్కడ.?" అన్న ప్రశ్న మళ్లీ ధర్నా చౌక్ కు దారితీసే ప్రమాదం ఉందనే చర్చ నగరంలో జోరుగా సాగుతోంది.

**హామీల హంగామా -- సమాధానం ఎక్కడ నాయకా.?**
**-పదవులు ఎగబాకాయి... కానీ ఇండ్ల ఫైళ్లు నేలకే అంటుకుపోయాయా.?**

డబుల్ బెడ్ రూం ఇండ్ల హామీలతో ఒకప్పుడు ధర్నా చౌక్‌ను సందడి చేసిన నాయకులు నేడు పదవుల్లో కూర్చున్నారు. కానీ "ఇల్లు" అనే సాధారణ అవసరం మాత్రం జర్నలిస్టుల జీవితాల్లో ఇంకా "ఫైల్‌లోనే ఫిక్స్" అయిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.
జీవితాంతం ఇండ్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి, కోరిక తీరకుండానే పరలోకాలకు పయనించిన సీనియర్ దళిత పాత్రికేయుడు దాసరి నరసింహ దంపతుల విషయంలో నాయకత్వం ఏమనీ సమాధానం చెబుతుందన్న ప్రశ్న ఇప్పుడు మరింత గట్టిగా మారింది. "హామీ ఇచ్చిన రోజు ఫోటోలు పెద్దవి... అమలు చేసే రోజు అడుగులు చిన్నవి" అన్న చలోక్తి ఇక్కడ సరిగ్గా సరిపోతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.
"మాటలతో మేడలు కట్టారు... కానీ గుడిసెలలోనే జీవితం గడిచిపోతోంది.!" అని పాత్రికేయులు పలువురు వ్యంగ్యంగా అంటున్నారు. హామీలు ఇచ్చిన నాయకులు పదవుల మెట్లు ఎక్కినప్పటికీ, ఇండ్ల కోసం ఎదురుచూసిన జర్నలిస్టుల ఆశలు మాత్రం మెట్లెక్కలేకపోయాయా.? అనే ఆవేదన వ్యక్తమవుతోంది."చెట్టు నాటితే నీడ వస్తుంది... హామీ నాటితే ఏమొస్తుంది.?" అని కొందరు ప్రశ్నిస్తుంటే, "పదవి వచ్చిందంటే బాధ్యత మరిచిపోవడమా.?" అని మరికొందరు నిలదీస్తున్నారు. ఒకరి జీవితకాల ఆశ నెరవేరకుండానే ముగిసిపోయినప్పుడు, సన్మానాల వేదికలపై పలికే శుభాషీసులు ఏ మేరకు సార్థకం అవుతాయో నాయకత్వమే ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని జర్నలిస్టు వర్గాలు అంటున్నాయి.
"హామీ ఇచ్చినవాడు పెద్దవాడయ్యాడు... హామీ నమ్మినవాడు పరలోకానికి వెళ్లాడు" అన్న వాక్యం నేడు నగరంలో చర్చనీయాంశంగా మారింది. ఇకనైనా మిగిలిన అర్హులైన జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించి, ఆలస్యమైనా న్యాయం చేయకపోతే "మాట నిలబెట్టిన నాయకుడు" అనే పేరు దక్కడం కష్టమేనని పాలమూరు డబుల్ బెడ్ రూం బాధిత జర్నలిస్టు లు స్పష్టం చేస్తున్నారు. హామీలు గాలిలో కాకుండా గడువులో నెరవేరితేనే విశ్వాసం నిలుస్తుందని జర్నలిస్టు వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. లేదంటే... "తాళాలు మాటల్లోనే, ఇళ్లు కలల్లోనే" అన్న సామెత నగరంలో కొత్తగా పుట్టినట్టే అవుతుందనే చర్చ సాగుతోంది.

# భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లిస్తాం

## -ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్ : మార్చ్ 02ప్రజా జ్యోతి**

కేఎల్ఐ కాల్వ నుండి చేగుంట,వెల్కిచర్ల గ్రామాలకు సాగునీరు వెళ్లే కాలువకు సంబంధించిన పరిహారం చెల్లిస్తామని చెప్పి,గత ప్రభుత్వం చెల్లించకపోవడంతో,కాలువ తవ్వడం వల్ల,భూమిని కోల్పోయి మోసపోయిన రైతులు కాల్వను పూడ్చివేశారు.భూములు కోల్పోయిన రైతుల బాధలను,సాగునీరు అందక రైతులుపడుతున్న ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొనిఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్ తమ నివాసంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, మహబూబ్ నగర్ డిప్యూటీ మేయర్ సురేందర్



రెడ్డి వెల్కిచర్ల మరియు చేగుంట గ్రామానికి చెందిన రైతులు,స్థానిక నాయకులు,ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించి వారితో చర్చించి కే.ఎల్.ఐ కాల్వ నుండి వెలికిచర్ల గ్రామానికి సాగునీరు వెళ్లే కాలువ వల్ల భూమిని కోల్పోతున్న రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి,నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఇట్టి ప్రకటన పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తూ సర్వే చేసి,కాల్వ పనులు మొదలు పెట్టడానికి అంగీకారం తెలిపారు. తమసమస్యపై చొరవ చూపిన ఇరిగేషన్ అధికారులు నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి,మహబూబ్ నగర్ డిప్యూటీ మేయర్ యం.సురేందర్ రెడ్డి తో సమావేశం నిర్వహించి,సమస్యను పరిష్కరించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (+వీ=) కు వెల్కిచర్ల గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కేశిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాలకోటి,మాజీ ఎంపీపీ కదిరే శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి నిదర్శనం

## - కొత్త తోటలో ఘనంగా ఇఫ్తార్ విందు



**మహబూబ్‌నగర్, మార్చి 1 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

మహబూబ్ నగరంలోని కొత్త తోటలో హరిఓం డైరీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరుల కోసం ఘనంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస దీక్షను విరమించి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మహబూబ్ నగరం కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి సౌభ్రాతృత్వంతో జీవిస్తున్న నగరమని పేర్కొన్నారు. ఇలాంటి ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకలని అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా హరిఓం డైరీ ఆధ్వర్యంలో నిరంతరం ఇఫ్తార్ విందు నిర్వహించడం అభినందనీయమని, సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవాన్ని పెంపొందించే కార్యక్రమాలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్.పి. వెంకటేష్, కార్పోరేటర్లు చిన్న, సిరాజ్ ఖాద్రీ, నాయకులు తఖి, యూత్ కాంగ్రెస్ నాయకులు ముకుందం రమేష్, సంజీవరెడ్డి, రఘు, యాదిరెడ్డి, గౌలి కిషన్, గౌలి మహేందర్, గౌలి కిశోర్, గౌలి సచిన్, మౌలానా బక్తియార్ సాహెబ్, మహ్మద్ అలీ సాహెబ్ తదితరులు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సత్కారం

గద్వాల మార్చి 01(ప్రజా జ్యోతి):సిందనూర్ పద్మశాలి సేవా సంఘం తరపున పద్మశాలి ముద్దు బిడ్డ,జోగులాంబ గద్వాల జిల్లా పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు,గద్వాల మున్సిపల్ కౌన్సిలర్ గా ఎన్నికైన పులిపాటి వెంకటేష్ ని మర్యాద పూర్వకంగా కలిసి, చిరు సత్కారం చేస్తూ,శుభాకాంక్షలు,శుభాభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పులిపాటి నాగప్ప,పులిపాటి రంగన్న,పులిపాటి యల్లప్ప,తాటికొండ వెంకటేష్, పులిపాటి రవి,పులిపాటి సిద్ధప్ప,ఎర్రబాటి నారాయణ,దోమ నర్సింహులు,మాజీ ఆప్కో డైరెక్టర్ దోమ వీరన్న,కాడిగి రాము,చిలువేరి రాకేష్,కొంగరి నరేష్,తదితరులు పాల్గొన్నారు.



# రెడ్డి కన్వెన్షన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే డా.రాజేష్‌రెడ్డి





**నాగర్ కర్నూల్ : మార్చ్ 01ప్రజా జ్యోతి**
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన రెడ్డి కన్వెషన్ ను ఆదివారం ఎమ్మెల్యేడా.కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ కన్వెన్షన్ హాల్ అభివృద్ధికి అవసరమైన జనరేటర్, రహదారుల ఏర్పాటుతో పాటు అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు కట్టుబడి ఉన్నామనిఅన్నారు.పేద,ప్రతిభావంతులైన విద్యార్థులకు రెడ్డి సేవా సమితి ద్వారా నాణ్యమైన విద్య,ఆర్థిక సహాయం అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని,ప్రతి విద్యార్థి ముందుకు రావాలని ఆకాంక్షించారు.కన్వెన్షన్‌కు సంబంధించి సమస్యలుంటే వాటిని పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని,ప్రతి పని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,సమితి సభ్యులు,గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులకు మోడల్ స్పోర్ట్స్ పాఠశాలలో ప్రవేశాల అవకాశం

## - 5వ తరగతికి దరఖాస్తులు ఆహ్వానం... మార్చి 13న జిల్లా స్థాయి ఎంపికలు

**మహబూబ్‌నగర్, మార్చి 1 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి మోడల్ స్పోర్ట్స్ పాఠశాలలు / వాటర్ స్పోర్ట్స్ అకాడమీ (క్రీడా పాఠశాలలు)లో 5వ తరగతిలో ప్రవేశాలకు మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన గిరిజన బాల, బాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె. జనార్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయస్సు 2026 ఆగస్టు 31 నాటికి 9 నుండి 11 సంవత్సరాల లోపు ఉండాలని పేర్కొన్నారు. వివిధ క్రీడల్లో బాల, బాలికలకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.
ప్రవేశాల కోసం విద్యార్థుల ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, సర్జెంట్ జంప్, మెడిసిన్ బాల్ పుట్, షటిల్ రన్, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, ఫ్లెక్సిబిలిటీ, 800 మీటర్ల పరుగు పందెం వంటి క్రీడా పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా జిల్లా స్థాయిలో ఎంపిక చేయబడిన 10 మంది బాలురు, 10 మంది బాలికలను రాష్ట్ర స్థాయి ఎంపికలకు పంపనున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయి ఎంపికలు మార్చి 13న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా క్రీడా ప్రాంగణం (బస్ స్టాండ్ సమీపంలో) నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం (2025--26 విద్యా సంవత్సరం) 4వ తరగతి చదువుతున్న గిరిజన బాల, బాలికలు కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం (గ్రామీణ ప్రాంతానికి రూ.1,50,000 లోపు, పట్టణ ప్రాంతానికి రూ.2,00,000 లోపు), రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, బోనఫైడ్ సర్టిఫికేట్, ఆధార్ కార్డ్ జిరాక్స్ ప్రతులతో మార్చి 12లోగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం, రూమ్ నెం.123, ఐడీఓసీ, పాలకొండ గ్రామం, మహబూబ్ నగర్ వద్ద దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక నిధి అవసరం

## - ప్రజాస్వామ్యం బలపడాలంటే మీడియా స్వేచ్ఛ, భద్రత కీలకం: ఎమ్మెల్యే

**మహబూబ్‌నగర్, మార్చి 1 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేసుకోవాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. రఘురామయ్య ఆడిటోరియంలో నగర మేయర్, డిప్యూటీ మేయర్‌ల సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా నిలబడాలంటే మీడియా స్వేచ్ఛ, జర్నలిస్టుల భద్రత అత్యంత అవసరమని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే వారే జర్నలిస్టులని, వారి సేవలు అమూల్యమైనవని కొనియాడారు. గ్రామీణ, పట్టణ స్థాయిలో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యతను జర్నలిస్టులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు.జర్నలిస్టులకు ఇళ్లు, ఆరోగ్య భీమా, గుర్తింపు కార్డులు, పెన్షన్ వంటి అనేక సంక్షేమ అంశాలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలను ముఖ్యమంత్రి మరియు సమాచార శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.




# జడ్చర్లలో ఆకస్మిక తనిఖీ

## -పారిశుధ్యంపై అదనపు కలెక్టర్ కఠిన ఆదేశాలు
## - వీధులు, డ్రైనేజీలు శుభ్రంగా ఉంచాలని సూచన

**మహబూబ్‌నగర్, మార్చి 1 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
జడ్చర్ల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేలా సమగ్ర చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు.
ఆదివారం జడ్చర్ల పట్టణంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. పట్టణంలోని ప్రధాన వీధులు, కాలనీలు, డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు. వీధుల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతర క్లీనింగ్ కార్యక్రమాలు చేపట్టాలని, డ్రైనేజీల్లో మురుగు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించడం మున్సిపల్ సిబ్బంది బాధ్యతగా భావించి పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని తెలిపారు. పారిశుధ్య పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు.



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**నాగర్ కర్నూల్: మార్చ్ 01 ప్రజా జ్యోతి**
1981-82 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నాగర్కర్నూల్ జిల్లా కేంద్రంలోని జడ్పీ పాఠశాల ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.పూర్వ విద్యార్థి ఆర్.సత్యం అధ్యక్షతన వహించి జ్యోతి ప్రజ్వలనతో సమ్మేళనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా గురువులను శాలువాలతో,మెమొంటోలతో సన్మానించారు.మాజీ మంత్రి పుట్టపాగ మహేందర్‌నాథ్ స్థాపించిన పాఠశాల సేవలను స్మరిస్తూవిద్యార్థులు తీపి జ్ఞాపకాలు గుర్తుచేసుకునిపాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



**నాగర్ కర్నూల్ :మార్చ్ 01ప్రజా జ్యోతి**
నాగర్ కర్నూల్ మండల పరిధిలోని తూడుకుర్తి గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో బైక్ పై వెళుతున్న తూడుకుర్తి గ్రామానికి చెందిన బోనగళ్ళ నాగ మషన్న తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి హుటా హుటిన నాగర్కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# శ్రీనివాస కాలనీ పార్క్‌ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

## - విరిగిన ఓపెన్ జిమ్, ఆట పరికరాలు వెంటనే మార్చాలని ఆదేశాలు

**మహబూబ్‌నగర్, మార్చి 1 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో రూరల్ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న పెద్ద పార్కును ఆదివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు, పిల్లల ఆట వస్తువులు విరిగి పోయి నిర్లక్ష్యానికి గురవుతున్నాయన్న విషయం దినపత్రికలో వెలువడిన నేపథ్యంలో అధికార యంత్రాంగం స్పందించింది. ఈ క్రమంలో అదనపు కలెక్టర్ స్వయంగా పార్కును సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులకు పార్క్‌ను పరిశుభ్రంగా ఉంచి సందర్శకులకు ఆహ్లాదాన్ని కలిగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విరిగిపోయిన ఓపెన్ జిమ్, పిల్లల ఆట మరియు క్రీడా పరికరాలను వెంటనే తొలగించి వాటి స్థానంలో కొత్త పరికరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న పార్కులు సురక్షితంగా, శుభ్రంగా ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

